## బోనాల జాతరకు ఎంపీకి ఆహ్వానం



**అల్వాల్:** యాప్రాల్ మహంకాళి దేవాలయంలో ఈనెల 10న నిర్వహించే బోనాల జాతరకు రావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. డాక్టర్ సత్యనారాయణబాబు, వెంకటేష్, పర్వతాలు, సంజయ్‌లాల్, పరమేష్, రాంరెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓం విహార్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ



**మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ ఓం విహార్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఓం విహార్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా అయోధ్యయాదవ్‌ను ఎన్నుకున్నారు. 24వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎంపల్లి అనంతరెడ్డి హాజరై నూతన కమిటీకీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు దేవేందర్, పాశం రాజు, వెంకటేష్‌యాదవ్, ఆంజనేయులు, సత్యం, వివిధ కాలనీల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'గ్రామ దేవతలను కొలుస్తే అన్నీ శుభాలే '

**మల్లాపూర్:** గ్రామ దేవతలను కొలుస్తే అన్ని శుభాలే కలుగుతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఓల్డ్ మల్లాపూర్‌లోని ఈదమ్మ ఉప్పలమ్మ, పోతరాజు శిఖర ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఓల్డ్ మల్లాపూర్ ఈదమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కల్యాణం.. కమనీయం

**మేడిపల్లి:** పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధి 12వ డివిజన్ బుద్ధానగర్ రోడ్డు నెంబర్-8 40 ఫీట్ రోడ్డులో కంబాలపల్లి శ్యామ్‌సుందర్, శివకుమార్‌ల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాసకల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ కార్పొరేటర్ భీంరెడ్డి నవీన్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

## కనుల పండువగా బోనాలు

**మల్లాపూర్:** కనుల పండువగా మల్లాపూర్ బోనాల జాతర ఆదివారం జరిగింది. మల్లాపూర్‌లోని ఈదమ్మ, పోచమ్మ, వెంకటరమణకాలనీలోని ఆరె పోచమ్మ అమ్మవార్లకి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు తీరారు. పలహారబండ్లు, తొట్టెల ఊరేగింపు కోలాహలంగా సాగింది. యువత నృత్యాలతో హోరెత్తించారు.

## ఉచిత ఆయుర్వేద సలహా శిబిరం



**సాక్షి, సిటీబ్యూరో:** నేరేడ్‌మెట్‌లోని ఋషి పీఠం చారిటబుల్ ట్రస్ట్ గ్లోబల్ హెడ్ క్వార్టర్స్ వేదికగా సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు, వైద్య విదుషీమణి డాక్టర్ గాయత్రీదేవి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద సలహా శిబిరం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ శిబిరంలో అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డా.గాయత్రీదేవి మాట్లాడుతూ.. గత పాతికేళ్లుగా ఋషి పీఠం పత్రిక ద్వారా ఆరోగ్యసూత్రాలు, అనారోగ్యసమస్యలకు పరిష్కారాలు చూపుతున్నానని చెప్పారు. ఏడాదికి ఒక్కసారైనా ఇలాంటి ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఋషి పీఠం ట్రస్టీ ఎం. సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో బీసీ ఉద్యమానికి తరలిరావాలి

**బోడుప్పల్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రేపటి నుంచి 6,7న ఢిల్లీలో జరిగే బీసీ ఉద్యమానికి బీసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బోడుప్పల్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో చేపట్టే ఈ ఉద్యమానికి సోమవారం ఉదయం 8 గంటలకు చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైల్‌లో బయలుదేరుతున్నట్లు వివరించారు. నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# తవ్వడం సరే.. పూడ్చడం ఎప్పుడో?

అభివృద్ధి పేరిట బాగున్న రోడ్ల తవ్వకాలు | ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు | పట్టించుకోని అధికారులు



ఎస్‌బీహెచ్ కాలనీలో మరమ్మతుకు నోచుకోని బీటీ రోడ్డు



లక్ష్మీనగర్ కాలనీలో ఇటీవల వేసిన సీసీ రోడ్డు తవ్విన దృశ్యం

**మలక్‌పేట:** అభివృద్ధి పేరిట బాగున్న రోడ్లను తవ్వుతుండటంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది. పైపులైన్ల ఏర్పాటు కోసం కాలనీల్లోని అంతర్గత రోడ్లు తవ్వి సరిగా పూడ్చకుండా వదిలేస్తుండంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. తాగునీరు, డ్రైనేజీ ఇతర పైపులైన్ల కోసం బీటీ, సీసీ రోడ్లను తవ్వి పూడ్చడం లేదు. దీంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. కొన్నిసార్లు రోడ్లను తవ్వగా వచ్చిన మట్టి, వ్యర్థాలు అలాగే రోడ్లపై వదిలేస్తున్నారు. అస్తవ్యస్తంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

### కాలనీల్లోనీ రోడ్ల దుస్థితి ..

కాలనీలోని రోడ్లను తవ్వి వదిలేస్తుండటంతో వర్షాలకు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లన్నీ గుంతలమయంగా మరాయి. విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఎక్కువగా ఉండటం రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాడైపోయిన రోడ్ల మూలంగా వాహనదారులు పాదచారులకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

### రోడ్లను ధ్వంసం చేస్తున్నారు..



ఇటీవల నిర్మించిన రోడ్లను ఇష్టానుసారంగా తవ్వడంతో ప్రజాధనం వృథా అవుతోంది. చెక్కు చెదరని రోడ్లు పైపులైన్ నిర్మాణ పనులతో పాడు చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లను పట్టించుకోవడం లేదు. సంబంధిత కాంట్రాక్టర్లు పనులు అసంపూర్తిగా చేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

–ప్రశాంత్, మూసారంబాగ్

## నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



**మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్‌లో నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆదివారం వెంకటరమణ కాలనీ కమిటీవాసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు జగదీశ్వర్‌రెడ్డి, కాలనీ జనరల్ సెక్రటరీ వెంకటేష్‌గౌడ్‌లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు పొంది, దేవాలయంలో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల అజయ్ రెడ్డి, నాయకులు మహేష్, సాయిరాంరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

**బోడుప్పల్:** అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మైసయ్య అన్నారు. ఆదివారం బోడుప్పల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి 337వ జ్ఞానమాలను వేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేడ్కర్ కన్న కలలను యువత సాకారం చేసుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వాలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 34 ఏళ్ల క్రితం చండూరులో జరిగిన మారణకాండ మృతులకు ఆయన నివాళులర్పించారు. భూ పరిరక్షణ సమితి రాష్ట్ర బుగ్గ మైసయ్య, యాకయ్య, యేసురాజు, అంజయ్య, బయన్న తదితరులున్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



## పాతికేళ్ల స్నేహగీతం

**సాక్షి, సిటీబ్యూరో:** దాదాపు 25 సంవత్సరాల క్రితం సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ లేనికాలంలో..ఎక్కడెక్కడివారో కలం స్నేహం ద్వారా కలిశారు. ఇప్పటికీ తమ స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నారు. 'పెన్–ఫోన్ అసోసియేషన్' పేరిట ఓ సమూహంగా ఏర్పడిన ఈ స్నేహ బృందం ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకున్నారు. పాతికేళ్ల తమ అనుబంధాన్ని నెమరేసుకున్నారు. ఉమ్మడి ఏపీలోని వివిధ జిల్లాలకు చెందిన వీరంతా ఉప్పల్ శిల్పారామంలో సరదాగా గడిపారు. శరత్, నాగరాజు, పుల్లారెడ్డి, మల్లికార్జున, అంజి, అస్లాం, నాగవీరేంద్ర, రవిపాల్‌రెడ్డి, టీవీ ఆర్టిస్ట్ మురళీకృష్ణ, దొరైస్వామి, రాజయ్యగౌడ్, జిలానీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్నకు ఘన నివాళి



**రామంతాపూర్ :** పాలమూరు ముద్దుబిడ్డ అణగారిన ప్రజల అభివృద్ధికి పోరాడిన పండుగ సాయన్న జయంతి ఆదివారం రామంతాపూర్ ముదిరాజ్ ఐక్యవేదిక అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో వెంకట్‌రెడ్డినగర్ బస్టాండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన నేతలు మాట్లాడారు. బీసీలు, బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలన్నదే సాయన్న లక్ష్యంగా ఉండేదన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. బీజేపీ సీనియర్ నేత గడ్డం సాయికిరణ్, సోమశేఖర్‌గౌడ్, సుధాకర్, ఎల్లాచారి, కొంపెల్లి ఉపేందర్‌ముదిరాజ్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**కాప్రా:** చిలుకానగర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, దశలవారీగా సమస్యలు పరిష్కరించుకుని ముందుకెళ్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చిలుకనగర్ డివిజన్‌లో పర్యటించిన ఆయన రూ.1,07,50,000 నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కల్యాణ్‌పురి ఇందిరానగర్, జాహిద్‌నగర్, బీరప్పగడ్డలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఈస్ట్ కల్యాణ్‌పురిలో కమ్యూనిటీహాల్, రాఘవేంద్రనగర్, చిల్కానగర్‌లో సీసీరోడ్లు, స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్ పైపులైన్ పనులు చేపట్టనున్నారు. కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ డీఈ వెన్నెల, ఏఈ రాధిక, బీఆర్‌ఎస్ నేతలు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ !



**గౌతంనగర్:** డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ సెవెన్‌హిల్స్ పాఠశాల సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు సైతం భయభ్రాంతులకు గురౌతున్నారు. విద్యుత్ వైర్లు రోడ్లకు వేలాడుతూ ఉండటంతో వర్షాకాలంలో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## మరో మహిళ మోజులో పడి..

- భార్యా పిల్లలను ఇంటి నుంచి గెంటేసిన భర్త
- ఇద్దరు పిల్లలతో సహా భర్త ఇంటి ఎదుట బాధితురాలి ఆందోళన



భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న లావణ్య

**రామంతాపూర్:** మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఓ పోలీస్ కానిస్టేబుల్ భార్యా పిల్లలను ఇంటి నుంచి గెంటేయడంతో ఆమె ఇద్దరు పిల్లలతో సహా భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టిన సంఘటన ఉప్పల్ పీఎస్ పరిధిలోని రామంతాపూర్ వెంకటరెడ్డినగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. బాధితురాలు లావణ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కటకం లావణ్యకు స్పెషల్ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కటకం నాగరాజుతో 2009తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. గత కొన్నాళ్లుగా నాగరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమెతో కలిసి వెంకటరెడ్డి నగర్‌లో ఉంటున్నాడు. ఈ విషయం తెలియడంతో లావణ్య ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి భర్త ఉంటున్న ఇంటికి వెళ్లి అతడిని నిలదీయగా నాగరాజు ఆమెను బయటికి గెంటేసి తాళం వేసుకున్నాడు. దీంతో ఆమె శనివారం రాత్రి నుంచి అదే ఇంటి ముందు ఆందోళన చేపట్టింది. దీనిపై ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా గతంలో ఇదే విషయమై మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పిన పోలీసులు తనను తిరిగి పంపారని తెలిపింది. తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులను డిమాండ్ చేసింది.

## మర్యాద పూర్వక కలయిక

**కీసర:** కీసర పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులును నాగారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ సీనియర్ నేత గూడూరు ఆంజనేయులుగౌడ్, స్థానిక నేతలు శ్రీనివాస్, మధుగౌడ్, బాషా తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు.

## దేశ పరిస్థితులకు అనుగుణంగానే రాజ్యాంగ రూపకల్పన

**ఘట్‌కేసర్:** అంబేడ్కర్ 18 డిగ్రీలు అభ్యసించి ప్రపంచంలోని 60 దేశాల రాజ్యాంగాలు చదివి దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రచించారని ఉపేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికి చెందిన వ్యక్తి కాదని, సబ్బండ వర్గాల ఉన్నతికి పాటుపడిన మహనీయుడని కొనియాడారు. దాసు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, రాజేష్‌కుమార్, అంజయ్య, కృష్ణంరాజు, అఖిల్, శివకృష్ణ, లలిత్ పాల్గొన్నారు.



## 'ఎన్‌ఎంపీఏ' అథ్లెటిక్స్‌లో ప్రతిభకు అభినందన

**అల్వాల్:** నగరంలోని జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ఎన్‌ఎంపీఏ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సైనిక్‌పురికి చెందిన పల్లపు డేవిడ్‌రాజు షాట్‌పుట్‌లో కాంస్య పతకం, డిస్కస్‌త్రోలో రజతం సాధించాడు. ముఖ్యఅతిథిగా హాజరైన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిలు డేవిడ్‌రాజును అభినందించారు.

## పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలి

**మల్లాపూర్:** వైద్యం కోసం పేదవారికి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నాచారంలో అనాహా డెర్మా, ఆర్థోక్లినిక్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సామల రఘు, ప్రసాద్, శ్రీలత, గ్రేటర్ బీఆర్‌ఎస్‌నేత సాయిజెన్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



**అల్వాల్:** ఓల్డ్ అల్వాల్ అంబేడ్కర్‌నగర్‌లో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 6న గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ద్వితీయ వర్ధంతిని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఎల్.యాదగిరి, సూర్యకిరణ్, రాజయ్య, కృష్ణ, బాలరాజు, మూర్తి, శ్రీనివాస్, రాంచందర్, ప్రసాద్, ఆనంద్, నర్సింహ, సాయి, రవి, చిత్తయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సైనికులకు సత్కారం

**అల్వాల్:** వీర్ రక్ష ఫౌండేషన్ డైరెక్టర్ సంతోష్‌కుమార్ మాలి ఆధ్వర్యంలో ఆదివారం బొల్లారంలో కార్గిల్ విజయ్‌దివస్, ఆపరేషన్ సింధూర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్‌లో వీర మరణం పొందిన రాంచందర్ తల్లి బాలమణిని సత్కరించి కార్గిల్ యుద్ధ వీరులను సత్కరించారు. శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, సత్యనారాయణస్వామి, సంతోష్‌కుమార్, నీరజ్ దూబే, జరిన్లెల్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, పాండే, స్వర్ణరెడ్డి, మాజీ ఆర్మీ ఆఫీసర్లు, సైనికులు పాల్గొన్నారు.



## వైభవంగా శ్రావణ బోనాలు

**బోడుప్పల్:** బంగారు మైసమ్మ దేవాలయంలో శ్రావణ బోనాల వైభవంగా జరిగాయి. బోనాల ఉత్సవానికి ఆదివారం తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

### మేడ్చల్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

బంగారు మైసమ్మ ఆలయంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, నేతలు కృష్ణ, కొత్త చక్రపాణిగౌడ్, శ్రీధర్‌గౌడ్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

### అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ కమిషనర్..

పోచమ్మ ఆలయంలో బోడుప్పల్ కమిషనర్ శైలజ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ దానగల్ల అనిత, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి తదితరులున్నారు.



బోనాల ఉత్సవాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డి



ప్రత్యేక పూజల్లో కమిషనర్ శైలజ